సాక్షి ప్రకాశం

సోమవారం | 6 | మార్చి | 2023



శింగరకొండకు తిరునాళ్ల శోభ

శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. 7వ తేదీన ప్రధాన తిరునాళ్ల జరగనుంది.

- 8లో..



ఆర్ఎంపీల సేవలు అభినందనీయం

గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం 8వ మహాసభలు ఒంగోలులో నిర్వహించారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
34 /20

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. వాతావరణంలో తేమ శాతం అధికం. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.

ఎమ్మెల్సీ పోరుకు సన్నద్ధం

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఓటర్లకు స్లిప్పుల పంపిణీ దాదాపు పూర్తికాగా ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాలు, బ్యాలెట్ బాక్సులు ఏర్పాటు చేశారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు. ఓటు హక్కు వినియోగంపై ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు. వెబ్‌కాస్టింగ్, వీడియోగ్రఫీతో పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

- ఈనెల 13న పోలింగ్
- జిల్లాలో మొత్తం 138 పోలింగ్ కేంద్రాలు
- ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్‌కాస్టింగ్, నెట్ లేని కేంద్రాల్లో వీడియోగ్రఫీ
- సమస్యలు, ఫిర్యాదులకు 1077 కాల్ సెంటర్



ఓటు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్, ఇతర అధికారులు (ఫైల్)

ఒంగోలు అర్బన్: ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు ఉపాధ్యాయ నియోజకవర్గం, పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో పోలింగ్ నిర్వహించేందుకు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేసు ఆధ్వర్యంలో సర్వం సిద్ధం చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఈ నెల 13వ తేదీ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరగనున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులతో పాటు పోలింగ్‌కు అవసరమైన సామగ్రి సిద్ధం చేశారు. డివిజన్ వారీగా ఆయా ఆర్డీవోలు, సబ్ కలెక్టర్లు పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. పట్టభద్రుల నియోజకవర్గం ఓటర్ల కోసం 98 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయ నియోజకవర్గం ఓటర్ల కోసం 40 పోలింగ్ కేంద్రాలు కలిపి మొత్తం 138 కేంద్రాలు పోలింగ్‌కు సిద్ధంగా ఉన్నాయి. పోలింగ్ కేంద్రాలకు అవసరమైన బ్యాలెట్ బాక్సులను నోడల్ అధికారి సిద్ధం చేశారు. వంద ఓట్ల కంటే ఎక్కువ ఉన్న పోలింగ్ కేంద్రాలకు 3, వంద ఓటర్ల కంటే తక్కువ ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలకు 2 బాక్సుల చొప్పున కేటాయించారు. పోలింగ్ కేంద్రాలకు నంబర్లు ఇవ్వడంతో పాటు ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాల సందేహం లేకుండా ఓటర్లకు స్పష్టంగా తెలిసేలా ఏర్పాట్లు చేశారు. ఓటింగ్ వేసే విధానంపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో పాటు ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఓటర్ల స్లిప్‌లు దాదాపుగా 90 శాతం మేరకు ఓటర్లకు పంపిణీ చేశారు. పోలింగ్ జరిగే రోజు ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్‌కాస్టింగ్ చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఎక్కడైనా ఇంటర్‌నెట్ సౌకర్యం లేని కేంద్రంలో వీడియోగ్రఫీ చేసేలా చర్యలు తీసుకున్నారు.

ఎన్నికల ప్రక్రియలో ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, ఓపీవోలు మొత్తం 950 మంది విధులు నిర్వహించనున్నారు. ఎన్నికల్లో విధులు నిర్వహించే అధికారులు, ఉద్యోగులకు ఎన్నికల నిర్వహణకు సంబంధించి దశల వారీగా పూర్తి స్థాయిలో శిక్షణ ఇస్తున్నారు. ఫిబ్రవరి 23వ తేదీ ప్రారంభమైన శిక్షణ ఈ నెల 9వ తేదీ వరకు విడతల వారీగా జరుగుతోంది. మైక్రో అబ్జర్వర్లకు ఈ నెల 6వ తేదీ, డివిజన్ స్థాయిలో, ఈ నెల 9వ తేదీ స్పందన భవనంలో శిక్షణ తరగతులు జరగనున్నాయి. శిక్షణలకు నోడల్ అధికారిగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి నిర్వహిస్తున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు, పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను పోలీసు శాఖ నిర్వహిస్తోంది. జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ పర్యవేక్షణలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు జిల్లాలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా, ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలతో యంత్రాంగం సిద్ధంగా ఉంది.

పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సంబంధించి 98 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం 82,225 మంది ఓటర్లు ఉండగా వారిలో 55,703 మంది పురుషులు, 26,517 మంది మహిళలు, ఐదుగురు ఇతర ఓటర్లు ఉన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సంబంధించి 40 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం 5,789 మంది ఓటర్లు ఉండగా వారిలో 3,691 మంది పురుష ఓటర్లు, 2,098 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఎన్నికలకు సంబంధించి సందేహాలు, ఫిర్యాదుల కోసం 24 గంటలు పనిచేసేలా 1077 కాల్ సెంటర్‌ను ప్రకాశం భవనంలో ఏర్పాటు చేశారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లు:	82,225
ఉపాధ్యాయ ఓటర్లు:	5,789
ఎన్నికల సిబ్బంది:	950 మంది
పట్టభద్రుల ఎమ్మెల్సీకి పోలింగ్ కేంద్రాలు:	98
ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి పోలింగ్ కేంద్రాలు:	40

శిక్షణలు మినహా మిగిలిన అన్నీ ఏర్పాట్లు పూర్తి



ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి విధులు నిర్వహించే అధికారులు, ఉద్యోగులకు శిక్షణ దశల వారీగా ఇస్తున్నాం. ఈ నెల 9వ తేదీతో శిక్షణలు ముగుస్తాయి. అవి మినహా పోలింగ్ కేంద్రాలు, బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు, భద్రతా చర్యలు వంటి అన్నిటికీ యంత్రాంగం సిద్ధంగా ఉంది. ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోలింగ్ నిర్వహించి పటిష్టమైన భద్రతతో బ్యాలెట్లను చిత్తూరు చేర్చే వరకు అన్నీ ఏర్పాట్లు చేశాం. ఓటు వేసే ప్రక్రియపై కూడా ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నాం.

– చిన ఓబులేసు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, డీఆర్ఓ

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి



ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశాం. వెబ్‌కాస్టింగ్, వీడియోగ్రఫీ ద్వారా పోలింగ్ నిర్వహిస్తున్నాం. ఎక్కడా అవకతవకలు, ఇబ్బందులు లేకుండా రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు, నిబంధనల మేరకు పనిచేస్తున్నాం. ఎన్నికల ప్రక్రియపై విధులు నిర్వహించే సిబ్బందికి పూర్తి స్థాయిలో శిక్షణ ఇచ్చి సిద్ధం చేస్తున్నాం.

– ఏఎస్ దినేష్ కుమార్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్

న్యూస్‌రీల్

8న నాయీ బ్రాహ్మణ ఉచిత వివాహ పరిచయ వేదిక

ఒంగోలు టౌన్: ఈనెల 8వ తేదీ నగరంలోని పద్మావతి ఫంక్షన్ హాలులో నాయీ బ్రాహ్మణ ఉచిత వివాహ పరిచయ వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న పరిచయ కార్యక్రమాన్ని జిల్లాలోని నాయీ బ్రాహ్మణులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ధరణికోట లక్ష్మీనారాయణ కోరారు. ప్రకాశం జిల్లా నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఆదివారం కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. 2019లో ప్రారంభించిన ఈ వేదిక ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుల్లో వేయి మందికి పైగా వివాహాలు జరిపించడంలో కృషి చేసిందని తెలిపారు. నాయీ బ్రాహ్మణ సంఘాల్లో వృత్తిదారులు, వాయిద్య కళాకారులు, వ్యాపారులు, డాక్టర్లు, ఉద్యోగస్తులతో పాటుగా ఇతర రంగాల్లో స్థిరపడిన వారందరినీ ఒక వేదిక మీదకు చేర్చడమే ఉచిత వివాహ వేదిక లక్ష్యమని ఆయన వివరించారు. వేదిక కన్వీనర్ నాదెండ్ల రాఘవ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పిల్లుట్ల సుధాకర్, వల్లూరి కోటేశ్వరరావు, తొండమల్లు చిన రంగయ్య, అన్నవరపు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు వెళ్లి పింఛన్ అందజేత



బీబీజాన్‌కు పింఛన్ అందిస్తున్న చెన్నకేశవగౌడ్

మార్కాపురం: పట్టణంలోని 13వ సచివాలయ పరిధిలోని వాలంటీర్ చెన్నకేశవగౌడ్ ఆదివారం గుంటూరు వెళ్లి పింఛన్ అందజేశాడు. సచివాలయ పరిధిలో ఉన్న బీబీజాన్ గుంటూరులోని ఒక ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతోంది. దీంతో గౌడ్ గుంటూరు ఆస్పత్రికి వెళ్లి రూ.2750 పింఛన్ అందించాడు.

నాయకత్వం కోసమే ఉద్యమాలు



సమావేశంలో మాట్లాడుతున్న రాజారావు

ఒంగోలు టౌన్: నాయకత్వం నిలుపుకోవడం కోసం మాత్రమే ఉద్యమాల పేరుతో కార్యాచరణ ప్రకటిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వినుకొండ రాజారావు విమర్శించారు. ఒంగోలులోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ పేరుతో ప్రభుత్వంతో చర్చలకు వెళ్తున్న నాయకులు ఆడే నాటకంలో సాధారణ ఉద్యోగులు విలవిల్లాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగులను రోడ్డు ఎక్కించే కార్యాచరణలతో చేసే ఉద్యమాల వల్ల వారికి ఒరిగేదేమీ లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మహ్మద్ హాజిరా బేగం, యం.జాన్ విక్టర్, జె.రమేష్,దూపాటి తిరుపతయ్య, వినోద్, షేక్ సమీనా, ఎంవీ నరసయ్య, యం.వెంకటేశ్వర్లు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చదరంగం క్రీడాకారులకు బహుమతులు

చీమకుర్తి: జిల్లా స్థాయి చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం చీమకుర్తిలోని శ్రీవిద్యానికేతన్ హైస్కూలులో నిర్వహించిన చెస్ పోటీల్లో పలు పాఠశాలల నుంచి 140 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వారిలో విజేతలుగా నిలిచిన వారికి శ్రీవిద్యానికేతన్ హైస్కూలు కరస్పాండెంట్ పీ.రవీంద్ర చేతుల మీదుగా ప్రశంస పత్రాలు, బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో చెస్ పోటీలకు సహకరించిన దాతలు, నిర్వాహకులు పాల్గొన్నారు.



చెస్ విజేతలకు ప్రశంస పత్రాలు అందిస్తున్న పి.రవీంద్ర

సెపక్ తక్రా జిల్లా క్రీడా జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

ఒంగోలు: సెపక్‌తక్రా జిల్లా క్రీడాజట్టు ఎంపిక ఆదివారం స్థానిక ఏబీఎం జూనియర్ కాలేజీ ఆవరణలో నిర్వహించారు. ఎంపిక ప్రక్రియను అసోసియేషన్ జిల్లా చైర్మన్ కృష్ణసాయి, అధ్యక్షుడు పవన్‌కుమార్, ఉమామహేష్, కార్యదర్శి డి.రవి ప్రసాద్ పర్యవేక్షించారు. ఈనెల 14 , 15 తేదీల్లో కర్నూలు జిల్లా నందికొట్కూరులో జరిగే రాష్ట్ర స్థాయి సీనియర్ విభాగం పోటీల్లో జిల్లా తరఫున ఎంపికైన జట్టు పాల్గొనాల్సి ఉంటుంది.

పురుషుల విభాగం: మధు, క్రీస్తు, దాసు, జాకబ్, వెంకట కోటయ్య, నాగార్జున.

స్త్రీల విభాగం: మధులత, దీపిక, బ్రాహ్మణి, మేఘన, పర్వీన్, స్వాతి.

9న జాతీయ స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు

మార్కాపురం టౌన్: కంభం మాజీ ఎమ్మెల్యే కందుల నాగార్జునరెడ్డి 17వ వర్ధంతిని పురస్కరించుకొని ఈ నెల 9న బేస్తవారిపేట జంక్షన్‌లో జాతీయ స్థాయి సీనియర్ ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహిస్తునట్లు ఆయన కుమారుడు కందుల ఓబుల రెడ్డి హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ కందుల గౌతమ్ నాగిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ బహుమతి రూ.1,01,116, ద్వితీయ రూ.75,116, తృతీయ రూ.60,116, చతుర్థ రూ.50,166, పంచమ బహుమతి రూ.40,116 ఇస్తామని, ఇంకా 6, 7, 8 బహుమతులు కూడా అందిస్తున్నామని తెలిపారు. కన్సొలేషన్ బహుమతులు కూడా అందిస్తున్నట్లు చెప్పారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో ఉప్పుగుండూరు యువకుడి సత్తా



సిటిజన్

నాగులుప్పలపాడు: జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన యువకుడు జి.సిటిజన్ సత్తా చాటాడు. జాతీయ స్థాయిలో పంజాబ్ రాష్ట్రంలోని పాటియాలాలో జరిగిన పోటీల్లో 74 కిలోల విభాగంలో సిటిజన్ 85 కిలోల బరువును పైకెత్తి 4వ స్థానంలో నిలిచాడు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎస్ఏఐ) ఆధ్వర్యంలో 2023 సంవత్సరానికి జరిగిన ఈ పోటీల్లో సిటిజన్ ప్రతిభ చూపాడు. అతడి తండ్రి ఎలీషా వాలీబాల్ క్రీడాకారుడు. సిటిజన్ ప్రస్తుతం ఎస్ఏఐ పాండిచ్చేరిలో శిక్షణ పొందుతున్నాడు. శిక్షణలో తనకు ప్రోత్సాహం అందిస్తున్న ఎస్ఏఐ కోచ్ కుక్కల విఠల్‌కు సిటిజన్ ధన్యవాదాలు తెలిపాడు.

గోపాల్‌రెడ్డికి వాసవి నంది సేవా పురస్కారం

మార్కాపురం: పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు, సంఘ సేవకులు దొంతిరెడ్డి గోపాల్‌రెడ్డికి ఆదివారం విజయవాడలోని వాసవిక్లబ్, పానుగంటి లలితరాణి క్లబ్ వారు సంయుక్తంగా వాసవినంది పురస్కారాన్ని అందించారు. గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ వివిధ రంగాల్లో నిష్ణాతులైన ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని దివ్యాంగులకు ఈ పురస్కారాన్ని అందించారన్నారు. తాను దివ్యాంగుల హక్కుల కోసం , చట్టాల అమలు కోసం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలో పర్యటించానన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి అండగా నిలవండి

- సీఎం దృష్టికి ఉపాధ్యాయుల సమస్యలు తీసుకెళ్లేందుకు సరైన అవకాశం
- రెండు రోజుల విశాఖ సమ్మిట్ నిరుద్యోగుల ఆకాంక్షలను నెరవేర్చబోతోంది
- ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి



మహిళలతో మాట్లాడుతున్న బాలినేని



వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు ఓటు వేయాలని కోరుతూ రంగారాయుడు చెరువు కట్టపై వాకర్స్‌ను కలసి అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే, పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: స్థానిక రంగారాయుడు చెరువు కట్టపై వాకర్స్‌తో వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. వైఎస్సార్ సీపీ బలపరుస్తున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిలను మంచి మెజార్టీతో గెలిపించాలంటూ ఆయన వాకర్స్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బాలినేని వాకర్స్‌తో ముచ్చటించిన తీరు ఆకట్టుకుంది. చాలా మందిని పేరుపేరునా పిలిచి పలకరిస్తుంటే వారిలో చెప్పలేని ఆనందం కనిపించింది. ఓటు వేసేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వైఎస్సార్‌సీపీ బలపరుస్తున్న అభ్యర్థులు ఎవరు, ఎందుకు అధికార పార్టీ తొలిసారిగా ఎమ్మెల్సీ ఎన్నికల బరిలోకి దిగుతుందన్న విషయాలను బాలినేని వాకర్స్‌కు స్పష్టం చేశారు. అభివృద్ధి వేగవంతం కావాలంటే అందుకు అందరి సహకారం ఉండాలన్నారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకోవడం ద్వారా వారి ప్రతినిధిగా శాసనమండలిలో సరైన కోణంలో చర్చించి ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకువెళ్లడం సాధ్యపడుతుందని వివరించారు. అనంతరం బాలినేని మీడియాతో మాట్లాడుతూ ఇప్పటి వరకు తూర్పురాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల అభ్యర్థులుగా ఒకే సంఘం ప్రతినిధులు ఎన్నికవుతూ వచ్చారన్నారు. అయితే తొలిసారిగా అధికార పార్టీ అయిన వైఎస్సార్‌సీపీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డికి మద్దతు ప్రకటించడంతోపాటు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని నిలబెట్టిందన్నారు. దేశ చరిత్రలనే తొలిసారిగా అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గుర్తింపు పొందిందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను సరైన కోణంలో శాసనమండలిలో చర్చించడంతో బాటు ముఖ్యమంత్రితో నేరుగా మాట్లాడి సమస్యను పరిష్కరించుకునే సౌలభ్యం ఉంటుందన్నారు. ఇందుకు తనవంతు సహాయ సహకారాలు కూడా తప్పకుండా ఉంటాయన్నారు. ఈనెల 13న జరిగే ఎన్నికలో పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి, పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలన్నారు. రెండు రోజుల విశాఖ సమ్మిట్ లక్షలాది ఉపాధి అవకాశాలు కల్పిస్తూ నిరుద్యోగుల ఆకాంక్షలు నెరవేర్చబోతోందన్నారు.

కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, స్థానిక కార్పొరేటర్ ఢాకా సుజాత హనుమారెడ్డి, కార్పొరేటర్లు వేమూరి భవాని, తాడి కృష్ణలత, నీలంరాజు సరోజ, గోపిరెడ్డి గోపాల్‌రెడ్డి, రెడ్‌క్రాస్ ఒంగోలు చైర్మన్ పి.ప్రకాష్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ కసుకుర్తి ఆదెన్న, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, నాయకులు కఠారి శంకర్, గంటా రామానాయుడు, ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొఠారి రామచంద్రరావు, చింతగుంట్ల సువర్ణ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక



జిల్లా జట్టుకు ఎంపికైన ఫెన్సింగ్ క్రీడాకారులను అభినందిస్తున్న ఫెన్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.నాగేశ్వరరావు తదితరులు

ఒంగోలు: 9వ రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక స్థానిక రాజీవ్‌నగర్‌లోని నారాయణ పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా ఆధ్వర్యంలో క్రీడాకారులు ఈ ఎంపికకు హాజరయ్యారు. బాలబాలికలకు పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకుగాను జిల్లా జట్టుగా ప్రకటించారు. ఎంపికైన వారిని ఫెన్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.నాగేశ్వరరావు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు, జిల్లా అధ్యక్షుడు బాలిశెట్టి నాగేశ్వరరావు, కార్యదర్శి జి.నవీన్, ఉపాధ్యక్షుడు కూనపరెడ్డి శివ, జిల్లా కోశాధికారి ఐ.భవాని అభినందించారు. ఎంపికైన జట్టు ఈనెల 10, 11 తేదీల్లో కాకినాడలోని ద్రోణా అకాడమీలో జరిగే పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు.

జిల్లా జట్టు ఇదే:

సాబర్ విభాగం:

బాలికలు: కె.నాగచిహ్నావి, ఆర్.విజయలక్ష్మి, ఆర్.కీర్తన (ఒంగోలు), కె.వేదవతి (చీమకుర్తి)

బాలురు: కేవీ సత్యసాయి (ఒంగోలు), టి.యశ్వంత్ (టంగుటూరు), ఎస్.వంశీ ప్రదీప్‌యాదవ్ (చీరాల), వి.వెంకట ప్రణయ్ (మార్కాపురం).

ఫాయిల్ విభాగం:

బాలికలు: పి.విజయలక్ష్మి, పీడీఎస్ షంషీర, కె.సాయిసేవిత (ఒంగోలు), కె.తనూజ (లింగంగుంట)

బాలురు: డి.రాజు (కందులూరు), ఐ.రామాంజనేయులు (కనిగిరి), టి.జయంత్‌రెడ్డి (ఒంగోలు), కె.వెంకటేశ్వర్లు(బల్లికురవ).

ఈపీ విభాగం:

బాలికలు: ఆర్.కీర్తి, ఓ.మౌనిక (ఒంగోలు), పి.తనుశ్రీ (కంభం), ఎం.లావణ్య (కందుకూరు)

బాలురు: జి.మణితేజ చౌదరి (ఒంగోలు), యం.నాగేశ్వరరావు (కనిగిరి), యం.ఆదినారాయణ (కనిగిరి), డి.శ్రీనివాసులు (సీఎస్‌పురం)

నేడు పొదిలి కొండకు ప్రత్యేక బస్సులు

పొదిలి రూరల్: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి సోమవారం పొదిలి కొండకు (పృథులగిరి లక్ష్మి నరసింహ స్వామి) ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ జె. సుందరరావు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి తిరునాళ్ళ పూర్తి అయ్యే వరకు 10 బస్సులను భక్తుల సౌకర్యార్థం తిప్పుతున్నట్లు పేర్కొన్నారు. పొదిలి డిపో నుంచి మర్రిపూడి కొండ వరకు చార్జీ కేవలం రూ. 30 మాత్రమే వసూలు చేస్తారన్నారు. అలాగే మంగళ వారం జరిగే సింగరకొండ ఆంజనేయ స్వామి తిరునాళ్లకు 10 ప్రత్యేక బస్సులు నడుపుచున్నట్లు తెలియజేశారు.

కొబ్బరి పువ్వు.. కేక



కొబ్బరి నీళ్ల తాగుతాం.. కొబ్బరి కాయ కొట్టి లోపల కొబ్బరి తింటుంటాం. ఒక్కోసారి కొబ్బరికాయ కొట్టినప్పుడు పువ్వు కనిపిస్తుంది. ఇలా పువ్వు కనిపిస్తే మంచిదని చాలామంది నమ్ముతారు. ఎంతో రుచిగా.. పోషక విలువలు అధికంగా ఉండే ఈ కొబ్బరి పువ్వు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. కొబ్బరి పువ్వు తింటే రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు కిడ్నీ సమస్యలను దూరం చేస్తుంది. మధుమేహంతో బాధపడుతున్న వారు కూడా ఈ పువ్వు తినొచ్చు. ఇన్ని ప్రయోజనాలున్న కొబ్బరి పువ్వులు ఉన్న కాయల్ని కేరళ నుంచి తీసుకొచ్చి ఒంగోలులో కొందరు విక్రయిస్తున్నారు. ఒక్కో పువ్వుని రూ.60కి అమ్ముతున్నారు. నగరంలోని కలెక్టరేట్, సీవీఎన్ క్లబ్ సెంటర్, అద్దంకి బస్టాండ్, లాయరుపేట సాయిబాబా ఆలయం తదితర సెంటర్లలో విక్రయిస్తున్నారు. దీని ప్రయోజనాలు తెలిసిన ప్రజలు కొనుగోలు చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఒంగోలు

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతదేహాన్ని, మోటర్ సైకిల్‌ను బయటకి తీస్తున్న పోలీసులు

మార్కాపురం: ద్విచక్ర వాహనం అదుపు తప్పి సైడ్ కాలువలో పడడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం సాయంత్రం పట్టణ పరిధిలోని బోడపాడు రోడ్డులో జరిగింది. త్రిపురాంతకం మండలం హసానపురం గ్రామానికి చెందిన ఎర్రంరెడ్డి రమణరెడ్డి (45) మార్కాపురం పట్టణంలోని తూర్పు వీధిలో నివాసం ఉంటూ బోడపాడు రోడ్డులో పొలం సాగు చేసుకుంటున్నాడు. ఆదివారం సాయంత్రం తన ద్విచక్రవాహనంపై పొలానికి వెళ్తుండగా అదుపు తప్పి సైడ్ కాలువలో పడడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నలుగురిపై కేసు నమోదు

సీఎస్‌పురం: ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన నలుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై పి.అనీల్‌కుమార్ తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా సీతారామపురం మండలం దేవిశెట్టిపల్లి గ్రామానికి చెందిన రేనాటి రమణయ్య కుటుంబ సభ్యులతో కలిసి కారులో దర్శికి వెళ్లి తిరుగుప్రయాణంలో ఉన్నారు. అదే సమయంలో అయ్యలూరివారిపల్లి సమీపంలో ఎదురుగా రెండు స్కూటీల్లో నలుగురు వ్యక్తులు వచ్చారు. రోడ్డు మార్జిన్ దిగే విషయమై స్కూటీలపై ఉన్న వారికి రమణయ్యకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో స్కూటీలపై ఉన్న బలభద్ర జేమ్స్ మరో ముగ్గురు కలిసి రమణయ్యపై రాయితో దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బలభద్ర జేమ్స్, మరో ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సింగరాయకొండ: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మెకానిక్ షేక్ అబ్దుల్ రవూఫ్(52) గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై షేక్ ఫిరోజ్‌ఫాతిమా తెలిపారు. స్థానిక మశీదు వీధిలో నివసిస్తున్న రవూఫ్ ఫిబ్రవరి 28వ తేదీన ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ఒంగోలు జీజీహెచ్‌లో చేర్పించగా మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. మృతుడికి నలుగురు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

స్కూటీని ఢీకొట్టిన కారు

- వృద్ధురాలు మృతి, ఇద్దరికి గాయాలు

జె.పంగులూరు: రోడ్డును క్రాస్ చేయబోయిన స్కూటీని కారు ఢీకొట్టడంతో వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందిగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదం జాతీయ రహదారిపై వెంకటాపురం స్టేజీ సమీపంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. రేణింగవరం ఎస్సై తిరుపతిరావు కథనం మేరకు.. పంగులూరు మండలంలోని అలవలపాడు గ్రామానికి చెందిన ఎర్రమోసు మోహన్‌రావు, గొట్టిపాటి వసంత, గొట్టిపాటి సుబ్బమ్మ(77) స్కూటీపై అలవలపాడు నుంచి అద్దంకికి బయలుదేరారు. జాతీయ రహదారిపై అలవలపాడు స్టేజీ దాటి వెంకటాపురం వైపు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా గుంటూరు వైపు నుంచి వస్తున్న కారు స్కూటీని ఢీకొంది. ఈ ప్రమాదంలో స్కూటీపై మధ్యలో కూర్చున్న గొట్టిపాటి సుబ్బమ్మ కిందపడగా తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మరణించింది. ఎర్రమోసు మోహన్ రావు, గొట్టిపాటి వసంతకు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటనా స్థలాన్ని ఎస్సై పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

శింగరకొండకు తిరునాళ్ల శోభ

- ప్రారంభమైన తిరునాళ్ల ఉత్సవాలు
- 7న ప్రధాన తిరునాళ్ల
- అలరించనున్న విద్యుత్ ప్రభలు, జెయింట్ వీల్స్
- దేవస్థానంలో ప్రత్యేక ఏర్పాటుతో పాటు, సత్రాల్లో అన్నదానానికి ఏర్పాట్లు పూర్తి
- క్షేత్ర ప్రాధాన్య విశేషాలతో ప్రత్యేక కథనం..



99 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహం

అద్దంకి–నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారి, శింగరకొండ ముఖ ద్వార రహదారికి, శింగరకొండకు మధ్య ఉన్న ట్రయాంగిల్ స్థలంలో 99 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహం ఉంది. ఈ విగ్రహం రాష్ట్రంలోని ఎత్తయిన ఆంజనేయస్వామి విగ్రహాల్లో రెండోది.



క్షేత్ర వ్యూ

అద్దంకి: బాపట్ల జిల్లాలోని అద్దంకి మండలం అద్దంకి–నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారి పక్కనే, శింగరకొండపాలెం గ్రామ సమీపంలోని భవనాశి చెరువు పక్కనే స్వయంభువుగా వెలసిన శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి క్షేత్రం 68వ వార్షిక తిరునాళ్ల ఆదివారం ప్రారంభమైంది. 7న నిర్వహించనున్న ప్రధాన తిరునాళ్లకు రాష్ట్ర నలుమూలల నుంచి 3 లక్షల మంది భక్తులు హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. తిరునాళ్ల రోజు పరిసర గ్రామాల వారు ఏర్పాటు చేయనున్న 14 నుంచి 16 ఎలక్ట్రిక్ ప్రభలపై నిర్వహించనున్న సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించనున్నాయి. ఆలయ రాజగోపురాలు, క్షేత్ర పరిసరాలు విద్యుత్ కాంతులీననున్నాయి. సుమారు 600 మంది పోలీసులు ఉత్సవంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు జరుగకుండా బందోబస్తు నిర్వహించనున్నారు.

స్వయంభూ ఆంజనేయ స్వామి..

ఈ క్షేత్రంలో పూర్వం కొండపైన లక్ష్మి నరసింహ స్వామి ఉత్సవం జరుగుతుండగా, కొండకు దిగువ భాగంలో చిల్ల చెట్ల మధ్య ఒక దివ్యమైన వెలుగు భక్తులకు కనిపించింది. కొందరు అదే సమయంలో కిందకు వచ్చి చూడగా అక్కడ ఆంజనేయ స్వామి, ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహ రూపంలో దర్శనమిచ్చాడు. ఆ స్వామిని మొదట్లో గొర్రెలు, గేదెల కాపరులు తమ జీవాలు చల్లగా ఉండాలని మొక్కుకునేవారు. వారి కోర్కెలు తీరగానే పశువులను, గొర్రెలను స్వామి చుట్టూ తిప్పి పొంగలి పెట్టుకుని మొక్కు తీర్చుకునేవారు. స్వామి కోరిన కోర్కెలు తీర్చేవాడని ఆ నోటా ఈ నోటా విన్న పరిసర గ్రామాల భక్తులు రావడం మొదలుపెట్టారు. అలా తొలుత పశువుల కాపరులు వేసిన పందిరి నుంచి చిన్న గుడి, ఆ తరువాత శాశ్వత దేవస్థానం ఏర్పడి, ఆదాయం బాగా వస్తుండటంతో దేవాదాయ శాఖ పరిధిలోకి చేరింది.

ముస్తాబైన సపరివార దేవతల దేవాలయాలు..

క్షేత్ర పరిసరాల్లో ఉన్న శ్రీరామనామ సంకీర్తనా మందిరం, విద్యుల్లత షిర్డీ సాయి ఆలయం, గణపతి, సుబ్రహ్మణ్య స్వామి ఆలయాలు, బ్రహ్మంగారి ఆలయం, గాయత్రీ మాత ఆలయం, పోలేరమ్మ దేవస్థానాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. టీటీడీ కళ్యాణమండపం, మారుతీ భవన్, దాతల సహకారంతో ప్రయాణికుల విశ్రాంతిశాల, పొంగలి శాల, అన్నదాన భవనం, పోటు, అధికారుల కార్యాలయం ఇటీవల నిర్మించారు. మాఢవీధులు, మారుతీభవన్ ఆధునీకీకరణ, ప్రస్తుత ముఖమండపం స్థానంలో రాతి ముఖ మండపాన్ని నిర్మించేందుకు ఇటీవలే శంకుస్థాపన చేశారు. శింగరకొండ క్షేత్రంలో అన్ని సామాజిక వర్గాల వారికి సంబంధించిన సత్రాలున్నాయి. ఆయా సత్రాల్లో ప్రధాన తిరునాళ్ల రోజు ఉదయం నుంచి అన్నదానం చేస్తూనే ఉంటారు.



ముస్తాబైన ఆలయ ప్రధాన రాజగోపురం



ఏర్పాటు చేసిన జైంట్ వీల్స్



ప్రభల కోసం చదును చేసిన ప్రదేశం



శ్రీ లక్ష్మీ నరసింహ ఆలయం

తిరునాళ్ల ఉత్సవాలు ప్రారంభం

- ఉష్టపతాకాన్ని ఆవిష్కరించిన మేదరమెట్ల శంకరారెడ్డి



ఉష్టపతాక పూజల్లో శంకరారెడ్డి, ట్రస్ట్‌బోర్డు సభ్యులు

అద్దంకి: జిల్లాలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ లక్ష్మీ నరసింహ, ప్రసన్నాంజనేయ స్వామి 68వ వార్షిక తిరునాళ్ల ఉత్సవ కార్యక్రమాలు ఆదివారం ఏసీ సుభద్ర, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కోట శ్రీనివాస కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. పూజల్లో భాగంగా ఉదయం 8.30గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచన, అఖండ దీపస్థాపన, మండప ఆరాధన పూజలు చేశారు. 9గంటలకు ధ్వజ స్తంభ నిర్మాణ దాత మేదరమెట్ల శంకరారెడ్డి ఉష్టపతాక పూజ, ధ్వజారోహణ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితుడు వంగల హరిశంకర అవధాని మాట్లాడుతూ తిరుణాళ్ల కార్యక్రమాన్ని తయాహ్నికంగా ఆదివారం ఉదయం ప్రారంభించడం జరిగిందన్నారు. ఆ ప్రారంభ మహోత్సవానికి రమ్మని దేవతలను స్వామి వాహనం అయిన ఉష్ట(ఒంటె)పతాకంతో ఆహ్వానించామని చెప్పారు. విశేషంగా ఏ దేవాలయంలోని లేని విధంగా స్వామికి ప్రతి రోజూ నిత్య అభిషేకం నిర్వహిస్తున్న విషయాన్ని వెల్లడించారు. అశేష భక్తులు మూడు రోజుల కార్యక్రమాల్లో పాల్గొని ఆ ప్రసన్నాంజనేయ, లక్ష్మి నరసింహస్వామి దేవతల ఆశీస్సులు పొందాలని కోరారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఉదయం 10గంటలకు భజనా కార్యక్రమం నిర్వహించారు.



ఉష్టపతాకాన్ని తీసుకొస్తున్న శంకరారెడ్డి, అర్చకులు

ఆర్‌ఎంపీల సేవలు అభినందనీయం

- గ్రామస్తులతో మమేకమై వైద్య సేవలు
- గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎంపిక
- 8వ జిల్లా మహాసభలో ముఖ్య అతిథులు



గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘ జిల్లా మహాసభలో మాట్లాడుతున్న అతిథులు

ఒంగోలు అర్బన్: గ్రామీణ ప్రాంతాల్లో డబ్బు ఇచ్చినా, ఇవ్వకున్నా ఆర్‌ఎంపీలు ప్రజలకు అందించే వైద్య సేవలు అభినందనీయమని డాక్టర్ కె. మాల్యాద్రినాయుడు, ఆర్‌ఎంపీ, పీఎంపీ రాష్ట్ర నాయకుడు బీటీ రాజు అన్నారు. స్థానిక కాపు కల్యాణ మండపంలో ఆదివారం గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘ 8వ మహాసభ ఘనంగా నిర్వహించారు. దీనికి ద్రోణాదుల సింగయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అతిథులు, సంఘ నాయకులు మాట్లాడుతూ గ్రామాల్లో ఆర్‌ఎంపీలుగా పని చేసే వారు గ్రామస్తులతో మమేకమై సొంత ఇంట్లో వారికి వైద్యం అందించినట్లు ప్రాథమిక చికిత్సలు అందిస్తూ, అవసరమైతే పెద్ద ఆస్పత్రులకు తీసుకువెళ్తూ వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో వేలాదిమంది ఆర్‌ఎంపీ, పీఎంపీలుగా ఉన్నారని, వారికి సరైన గుర్తింపు లేదన్నారు. వీరికి పారామెడికల్ బోర్డు ద్వారా శిక్షణలు ఇచ్చి విలేజ్ క్లినిక్‌ల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. అనుభవం ఉన్న వారికి పరీక్షలు నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కల్పించాలన్నారు. గ్రామీణ వైద్యుల సేవలను గుర్తించి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పారామెడికల్ శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు ఇచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విలేజ్ క్లినిక్‌లు, ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ప్రతిరోజు వైద్య విధానం, వైద్య పరికరాల్లో ఎన్నో మార్పులు వస్తున్నాయని వాటి గురించి ఆర్‌ఎంపీలు కూడా తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దీనిలో సంఘ నాయకులు నాగరాజు, మాలకొండయ్య, బట్టు బాలాజీ, పి.చంద్రశేఖర్, కె.బాలచందర్, ఇమాంసా సాహేబ్, కె. రాజగోపాల్, భాస్కరరావు, రమేష్, పీవీ కృష్ణారావు పాల్గొన్నారు.

నూతన కమిటీ

గ్రామీణ వైద్యుల వెల్ఫేర్ సంఘ నూతన కమిటీ జిల్లా అధ్యక్షునిగా బట్టు బాలాజీరావు, ప్రధాన కార్యదర్శి కె.బాలచంద్రం, కోశాధికారి కందుకూరు రాజగోపాల్, ఉపాధ్యక్షులుగా షేక్ ఇమామ్ సాహెబ్, సహాయ కార్యదర్శిగా పి.కృష్ణారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పి.నాగరాజు, మీడియా ఇన్‌చార్జ్‌గా దాసరి సుధాకర్‌లు ఎంపికయ్యారు. నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం నిర్వహించారు.

ఉలిక్కిపడిన చీమకుర్తి!



తీవ్రంగా గాయపడిన గాదంశెట్టి శ్రీనివాసులు



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న క్రైమ్ ఏఎస్పీ శ్రీధర్, ఎస్సై ఆంజనేయులు



వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ నాగరాజు

- ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ఉద్యోగిపై ఇద్దరు దుండగుల దాడి
- చేతి కడియంతో ముఖంపై పిడిగుద్దులు
- కౌంటర్‌లో ఉంచిన రూ.15 వేల నగదుతో పరారీ
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన క్రైమ్ ఏఎస్పీ శ్రీధర్, డీఎస్పీ నాగరాజు

చీమకుర్తి: ఆధార్ కార్డుతో డబ్బు డ్రా చేసే నెపంతో ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ అనే ప్రైవేట్ బ్యాంక్‌కు వెళ్లిన ఇద్దరు దుండగులు కౌంటర్‌లో ఉన్న ఉద్యోగిపై విచక్షణా రహితంగా దాడి చేశారు. కౌంటర్‌లో ఉంచిన రూ.15 వేల నగదుతో అక్కడి నుంచి పరారయ్యారు. శనివారం రాత్రి రూ.10.30 నుంచి 11 గంటల మధ్యలో చోటుచేసుకున్న ఈ ఘటనతో చీమకుర్తి పట్టణం ఉలిక్కిపడింది. పోలీసుల కథనం మేరకు.. చీమకుర్తి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నగదు లావాదేవీల నిర్వహణకు సంబంధించిన ఐడీఎఫ్‌సీ ఫస్ట్ అనే ప్రైవేట్ బ్యాంక్ కౌంటర్ ఉంది. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆధార్ కార్డు ఇచ్చి డబ్బు డ్రాచేయాలని కౌంటర్‌లో ఉన్న గాదంశెట్టి శ్రీనివాసులును అడిగారు. ఆధార్ కార్డుతో బ్యాంక్ అకౌంట్లు ఏపీ లింక్ కాలేదని శ్రీనివాసులు చెప్పాడంతో ఆ ఇద్దరు బయటకు వెళ్లారు. పరిసరాలను గమనించి వెంటనే లోపలకు వచ్చారు. ఓ వ్యక్తి షాప్ షట్టర్ మూసేయగా మరొకడు తన చేతికున్న స్టీల్ కడియంతో కౌంటర్‌లో ఉన్న గాదంశెట్టి శ్రీనివాసులును ముఖంపై విచక్షణా రహితంగా దాడి చేశాడు. శ్రీనివాసులుకు తీవ్ర గాయాలు కాగా శరీరంపై దుస్తులు రక్తంతో తడిసిపోయాయి. కౌంటర్‌లో ఉన్న రూ.15 వేల నగదు తీసుకుని బయటకు వచ్చేలోగా స్థానికులు పోగవడంతో దుండగులు తమ బైకును అక్కడే వదిలేసి పరారయ్యారు.

సంఘటనా స్థలాన్ని జిల్లా క్రైమ్ ఏఎస్పీ శ్రీధర్, ఒంగోలు డీఎస్పీ నాగరాజు, ఒంగోలు రూరల్ ఇన్‌చార్జి సీఐ రంగనాథ్, చీమకుర్తి ఎస్సై ఆంజనేయులు ఆదివారం ఉదయం పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. నిందితులు వదిలివెళ్లిన బైకు వారి పేరు మీదకు ఇంకా ట్రాన్స్‌ఫర్ చేయించుకోలేదని గుర్తించారు. నిందితులను త్వరలోనే అరెస్టు చేస్తామని పోలీసులు ధీమా వ్యక్తం చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. కాగా.. కౌంటర్లో పనిచేసే వ్యక్తిపై దాడి చేసి డబ్బు తీసుకుపోయారనే విషయం చీమకుర్తి పట్టణంలో దావాలనంలా వ్యాపించడంతో వ్యాపారులు, ఇతర దుకాణదారులు ఉలిక్కిపడ్డారు.

ఉరేసుకుని పదో తరగతి విద్యార్థి మృతి

కంభం: ఫ్యాన్‌కు ఉరేసుకుని పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం సాయంత్రం కంభంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. స్థానిక సొసైటీ కార్యాలయం సమీపంలో నివాసం ఉంటున్న అంకయ్య, పార్వతి దంపతులకు ఇద్దరు కుమారులు కాగా చిన్నవాడు నూనె విజయ్(16) కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఆదివారం సాయంత్రం ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని వేలాడుతుండగా స్నేహితులు, చుట్టుపక్కల వారు గమనించారు. హుటాహుటిన కిందకు దించి కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే విజయ్ మృతి చెందాడని సూపరింటెండెంట్ డా.శివనాయక్ తెలిపారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్సై.. మృతుడి కుటుంబ సభ్యులు, స్నేహితులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఇదిలా ఉండగా.. విజయ్ పాఠశాలకు సక్రమంగా వెళ్లేవాడు కాదని, బాగా చదువుకోవాలని ఉపాధ్యాయులు చెప్పేవారని తెలిసిందని పోలీసులు తెలిపారు. ఉపాధ్యాయులు మందలించారని ఆత్మహత్య చేసుకున్నాడా, మరేవైనా కారణాలున్నాయా అనే విషయాలు దర్యాప్తులో తేలాల్సి ఉందని ఎస్సై చెప్పారు.



మృతి చెందిన విజయ్